

సూర్యకుటుంబంలో కోపర్నికస్ అని ఒక గ్రహముంది. భూమికన్నా సుమారు నాలుగైదు బిలియన్ సంత్సరాల కిత్రమే అది ఏర్పడింది. బుద్ధి జీవుల జాతి కూడా అక్కడే చాలాకాలం కిత్రమే అభివృద్ధి చెందింది.

ఏడు వందల యాభై మిలియన్ల సంవత్సరాలనాడే కోపర్నికన్లు చలనచిత్ర యంత్రాన్ని కనుగొన్నారు. మనకు తెలిసిన సినిమా కెమెరాలు సెకండుకు యిరవై నాలుగు ఫ్రేముల్ని బొమ్మల్లో బంధిస్తాయి. ప్రొజెక్టర్ మీద ఫిల్ము తిరిగినప్పుడు ఆ స్టిల్స్ కదిలి మన దృష్టికి చలనచిత్రం అనే భ్రమ కలుగుతుంది. స్లోమోషన్ కెమెరాతో కదలిక వేగాన్ని తగ్గించటం కూడా సాధ్యమే. దీని సహాయంతో సెకండుకు తొంభై ఆరు లేదా అంతకన్నా ఎక్కువ ఫిల్ములు షూట్‌చేసి, యిరవైనాలుగు ఫ్రేముల స్పీడులో ప్రొజెక్ట్ చేయవచ్చు.

మన కళ్లకు కనిపించని కదలికను పట్టుకోవటం ఎలా? టైం లాప్స్ కెమెరా ద్వారా యిదీ సాధ్యమే. సెకండుకొక ఫ్రేము లేదా నిమిషానికో, గంటకో ఒక ఫ్రేం షూట్ చేసి, సాధారణ వేగంలో ప్రాజెక్ట్ చెయ్యటమే. విత్తనాలు మొలకెత్తటాన్ని యిలాగే చిత్రీకరిస్తారు.

757మిలియన్ సంత్సరాల క్రితమే టైంలాప్స్ కెమెరాలను కనిపెట్టిన కోపర్నికన్లు, అత్యంత శక్తివంతమైన టెలిస్కోపులతో భూపరిణామ దశలను చిత్రీకరించారు. దీనికోసం, వాళ్లు సంవత్సరానికో ఫ్రేం మాత్రమే షూట్‌చేశారు.

ఇటీవలే, అంతర్గ్రహ వ్యోమనౌకలో వచ్చిన కోపర్నికన్లు తమ టైంలాప్స్ కెమెరాతో చిత్రించిన భూపరిణామ చరిత్రను ఒక సంవత్సరం పాటు సినిమాగా ప్రదర్శించారు. ఇది జనవరి ఒకటి తొలి సెకండు నుండి డిసెంబర్ 31చివరి సెకండు దాకా నాన్ స్టాప్‌గా చూపించారు. ప్రాజెక్షన్ స్పీడ్ సెకండుకు యిరవైనాలుగు ఫ్రేములు: అంటే సెకండుకు యిరవైనాలుగు సంవత్సరాల భూ చరిత్ర. ఆ లెక్కన నిమిషానికి 1440సంవత్సరాలు. గంటకు 86,400సంవత్సరాలు. రోజుకు రెండు మిలియన్, నెలకు 62మిలియన్ సంవత్సరాలు. దీని ప్రకారం మనిషి సగటు ఆయుర్దాయం మూడుసెకన్లు. సంవత్సరకాలంలో 757మిలియన్ సంవత్సరాల భూచరిత్ర ప్రీకాంబ్రియన్ దశ నుండి నేటిదాకా- అంటే భూనిర్మాణం నుండి కాక, జీవుల ఆవిర్భావ దశ నుండి నేటిదాకా ప్రదర్శితమైందన్నమాట.

జనవరి, ఫిబ్రవరి, మార్చినెలల్లో సినిమా ఏమాత్రం ఆసక్తికరంగాలేదు. అప్పటి భూవుపరితలమూ, సముద్రాలూ యిప్పుడు మనకు తెలిసినట్టుగాలేవు. రెండూ కలిసిన ఒక మసక దృశ్యం చెదురుమదురుగా తెరపై కదలాడింది. కొన్నిసార్లు భూమి తొలుచుకుని నీటిలో కలిసిపోయింది.నేల గట్టిగా వుండేమో. కురిసిన వర్షం కురిసినట్టే సముద్రాల వైపు ప్రవహించింది. నదులూ, కాలవల జాడేలేదు. నీటి వుధృటిలో కొట్టుకుపోతున్న పెద్దపెద్ద బండలు, కొండలు కూడా దర్శనమిచ్చాయి. ఎండ వేడికి, పర్వతాలు కరిగిపోయిన దృశ్యాలు చూశాం. నీళ్లలో మునిగిని రాళ్లు విరిగి కొండలుగా పైకిలేచాయి.

ఏప్రిల్ ప్రారంభంలో, వెచ్చని సముద్రాజలాల్లో తొలిసారిగా ఏకకణజీవులు ఆవిర్భవించాయి. నెల చివరకవి అభివృద్ధి చెంది పెంకువున్న జలచారాలు -ట్రైలోబైట్స్‌గా రూపాంతరంచెందాయి.

వెన్నెముక గల జీవజాతి మే నెలలో కన్పించింది. కాని, అవింకా నీళ్లనుండి నేలపైకి ఎగబాకలేదు. జూన్‌లో, యిప్పుడు మనకు తెలిసిన వుత్తర అమెరికా భూఖండం జలమయమే. రాకీ పర్వతాలు మాత్రం నీళ్లలో ఒక సన్నటి గీతలాగ కన్పించాయి. లోతు తక్కువగా వున్నచోట సున్నపు రాతి సమూహాలు ఏర్పడ్డాయి. చమురు, గ్యాస్ నిక్షేపాలను కూడా అక్కడక్కడ పోల్చుకోగలం. అప్పటికీ, నేలమీద ఒక్క పచ్చ మొక్కకూడా కనిపించలేదు. నీటి ఒరవడికి నేల తొల్చుకుపోతూనేవుంది.

జూలైలో వృక్షాల వేళ్లు దన్నుకున్నాయి. అంటే నేలకు కాస్త రక్షణ ఏర్పడింది. మరికొద్ది రోజుల్లో, కనిపించినంతమేరా అరణ్యాలు వ్యాపించాయి. ఆకులు, కొమ్మలు పెరిగి ఎండవేడి నుండి నేలకు గొడుగుపట్టాయి- మొక్కలే గద భూచరాలకు ఆహారం.

ఆగస్టు ప్రారంభంలో, సముద్రాలనిండా చేపలు తిరుగాడాయి. జియాలజిస్టులు దీన్ని డెవోనియన్ దశగా పరిగణిస్తారు. కొన్ని చేపలు మొప్పలద్వారా గాక, వూపిరితిత్తుల సహాయంతో వూపిరి పీల్చుకోగలవు. నెలాఖరున ఈ చేపలు కొన్ని భూమి మీదికి పాకి, బల్లిలాంటి జంతువులుగా ఆకృతి చెందాయి. వీటినే ఉభయచర జీవులన్నారు.


సెప్టెంబరులో 24అంగుళాల పొడుగు రెక్కలున్న కీటకాలు తొలిసారిగా ఎగిరాయి. ఇప్పుడు ఎటు చూసినా అరణ్యాలే. నేలలో బొగ్గు నిక్షేపాలు పెరిగాయి. చెట్లకు విత్తనాలు గల కాయలు కాశాయి. సరీసృపాలు జరజరా పాకాయి. నీళ్లలో గుడ్లుపెట్టి ఉభయచరజీవులు తమ సంతతిని వృద్ధి చేసుకున్నాయి. వాతావరణ పరిస్థితులను తట్టుకోవటానికి కాబోలు, నేలమీది సరీసృపాలు గట్టి పెంకు గల గుడ్లు పెట్టాయి. సెప్టెంబర్ చివరలో తొలిడైనోసార్లు కనిపించాయి. ఆ తర్వాత 140మిలియన్ సంవత్సరాలివి భూమి మీద స్వైరవిహారం చేశాయి.

అక్టోబర్‌లో ఎత్తైన పర్వతాలు భూమిలోంచి పైకిలేచాయి. రెక్కలున్న జంతువుల కొన్ని ఆకాశంలో విహరించాయి. మరికొన్ని జంతువులకు స్తన్యగ్రంధులేర్పడి పిల్లలకు పాలిచ్చాయి. జీవచరిత్రలో (స్తన్యగ్రంధులేర్పడిన) ఈ దశ కీలకమైనదంటారు శాస్త్రజ్ఞులు-ఇక, డైనోసార్లలో ఎన్నో రకాలు-మేకంత చిన్నవాటి నుండి నలభైటన్నుల బ్రాంటోసారస్‌దాకా. ఇవి ప్రధానంగా శాకాహారులు. తరువాతి దశలో కొన్ని మంసాహారులుగా కూడా మారాయి- వీటిని అలోసారస్, టైరానోసారస్‌లన్నారు. శత్రువుల నుండి రక్షణకుగాను, శాకాహార డైనోసార్ల చర్మం అత్యంత దళసరిగా మారింది.

నవంబర్‌లో సరీసృపాలు కొన్ని గబ్బిలాల్లాగా ఎగిరాయి. ఇందులో, టెరానాడన్ జాతి జీవుల రెక్కల వెడల్పు 156అడుగులదాకా పెరిగింది. వివిధ పుష్పజాతులూ, మన మిప్పుడు చూస్తున్న చెట్లు, కీటకాలూ తొలిసారిగా కనిపించాయి. ఏమైందోగాని, డైనోసార్ల జాతి అకస్మాత్తుగా అంతమైంది. భూమి పొరలో జరిగిన కదలికల వల్ల అమెరికన్ భండమున్న చోట రాకీ పర్వతాలు పైకిలేచాయి.

డిసెంబర్ నెలంతా, స్తన్యగ్రంధులున్న జంతువులే అన్ని చోట్లా కనిపించాయి. పండిన పళ్లు, గింజల్ని వెదజల్లగా కొత్తమొక్కలు మొలిచి జంతువులకు తగినంత ఆహారం లభించింది. నదులలో, కాలవలలో నీళ్లు స్వచ్ఛంగా ప్రవహించాయి. డిసెంబర్ 25నాడు గ్రాండ్‌కాన్యన్ (అమెరికాలోని ఒక భూ భౌతిక వింత), కొలరాడో నది కనిపించాయి. ప్రీకాంబ్రియన్ దశ ఒకటుండేదని దీనివల్లనే మనం తెలుసుకోగలిగాం.

నెలాఖరుదాకా యిదే పరిస్థితి. ఇంతవరకూ ఎక్కడా మానవజాతి ఆచూకీలేదు. అసలు, భూమ్మీద మనిషి యిక కనిపించడా అని ప్రేక్షకుల్లో కలకలం మొదలైంది. ఆ భయమక్కర్లేదు. డిసెంబర్31 నాడు మధ్యాహ్నం (మిలియన్ సంవత్సరాల క్రితం) మనిషిని పోలిన ఒక జీవి కన్పించింది.



దీన్ని పైతెకాంత్రోపస్ లేక జావా ఏప్‌మాన్ అన్నారు. కాని, ఆనాడు ఈ జీవికి మిగతా జంతువులన్నీ శత్రువులే. మన ఏప్‌మాన్ ఉనికి ప్రమాదంలో పడింది. రాళ్లూ, చెట్ల కొమ్మలు తప్ప రక్షించుకోవటానికి మరే ఆయుధం అందుబాటులో లేవు. పైగా, అప్పటి, విపరీత శీతోష్ణస్థితులు మనుగడకు సాయపడవు. సముద్రాలలో నాలుగువేల అడుగులలోతు మంచుపేరుకుపోయింది. హిమనదాలు, ఖండాలకు అతిసమీపంగా వచ్చాయి. వీటి ప్రభావంతో భూమి మీది వృక్ష, జంతు జాతులు ప్రమాదంలో పడ్డాయి. మంచుతగ్గినప్పుడు భూమి మీది జీవులు కాస్త కోలుకున్నాయి. దట్టమైన బొచ్చుగల జంతువులు అప్పుడే ఆవిర్భవించాయి. ఆనాటి మనిషిలాంటి జీవికి యివే ఆహారం.

సాయింత్రమైంది. మనకు తెలిసిన మానవుని జాడలేదు.


చివరికి, రాత్రి పదకొండు దాటినతర్వాత నియాండర్‌తక్ మనిషి కనిపించాడు. మరో అరగంట గడిచింది. గుహలలో జంతువుల చిత్రాలు గీస్తూ క్రోమాగ్నాన్ మానవుడు కదిలాడు. మరో పదిహేను నిమిషాలకు నియోలితిక్ మనిషి తెరమీదికి వచ్చాడు. మరిన్ని నిమిషాలు గడిచాయి. కుక్కల్నీ, గొర్రెల్నీ, యితర జంతువుల్నీ మచ్చిక చేసుకున్నాడతడు. సెకండ్లముల్లు తిరుగుతున్నది. బుట్టలల్లటం, కుండలు, చిన్న చిన్న పడవలు చెయ్యటం కూడా ప్రారంభించాడు. మనం గర్వంగా చెప్పుకునే నాగరికతా ఆవిర్భావం జరిగింది ఈ సినిమా చివరి అయిదు నిమిషాల్లోనే. ఈజిప్షియన్లు, బాబిలోనియన్లు, గ్రీకులు, రోమన్లు చివరి నాలుగు, మూడు, రెండు నిమిషాల్లో కనిపించారు.

పదకొండు గంటల, యాభైఎనిమిది నిమిషాల, నలభైమూడు సెకండ్ల మీదికి వచ్చింది ముల్లు. అప్పుడు ప్రారంభమైంది క్రీస్తు శకం. సినిమా ముగుస్తుందనగా, యిరవై సెకండ్ల ముందు కొలంబస్ అమెరికాను కనుగొన్నాడు. కేవలం ఏడు సెకండ్ల ముందే అమెరికా స్వాతంత్ర్యం ప్రకటించుకుంది.

ఇక మనం మాట్లాడుకోగలిగింది క్షణాలలో, లిప్తలలో మాత్రమే. తెల్లవాళ్ల గుంపులు వచ్చి రెడ్ ఇండియన్లను తుడిచిపెట్టాయి. దట్టమైన అరణ్యాలు అంతరించాయి. వాతావరణ దుష్ప్రభావన్నుండి నేలను రక్షించిన చెట్లు, గడ్డి మైదానాలు యిప్పుడెక్కడా కనిపించావు. సముద్రం మళ్లీ నేలను తొలుస్తున్నది. నదులలో మట్టి మేటలు వేస్తున్నది. నేలలోని లవణాలు, ఖనిజాలు హరించుకుపోతున్నాయి. రైలు మార్గాలూ, ఎత్తైన భవనాలూ బాగానే వున్నాయి గాని అవి భూమికి పొంచి వున్న ప్రమాదాన్ని అడ్డుకోలేవు. ఆసియా దేశాలలో కొందరింకా పిడకలనే వంటచెరుకుగా వాడుతున్నారు. మరికొన్ని చోట్ల అరణ్యాలను తగలబెడుతున్నారు. వృక్ష సంపదను నాశనం చెయ్యటం ఆత్మహత్యా సదృశం. భూమికి ఆచ్ఛాదన కరువైంది. ఇసుక తుఫానులు వేలాది మైళ్ల ప్రయాణం చెయ్యగలుగుతున్నాయి. చివరి కొద్ది సెకండ్లలో భూమ్మీద తిరుగాడిన ఈ మానవజీవులు అచ్చుగుద్దిన కాగితాలను, పసుపుపచ్చటి లోహాన్నీ పోగు చేసుకుంటూ అదే 'సంపద'ని మురిసిపోతున్నారు. కాని, మనిషి మనుగడకు అవసరమైన భూ వుపరితలం మాత్రం నాశనమైపోతోంది–

మనమిక్కడకి వచ్చి నిమిషం కూడా కాలేదు. ఎంతకాలముండగలమో ఇక్కడ?

**మూల రచన: జేమ్స్‌రెటీ**
**అనుసరణ: ముక్తవరం పార్థసారథి**



# తొలి 'దీపావళి' చిత్రం

1933నాటికి తెలుగులో నాలుగు చిత్రాలు నిర్మితమయ్యాయి. ఈ నాలుగు ఉత్తరాది వారి పెట్టుబడితో తయారయినవే. తెలుగువారి పెట్టుబడితో ఓ తెలుగు చిత్రం తీయాలన్న ఆలోచనకు కార్యరూపమే 'పృథ్వీ పుత్ర' లేక 'నరకాసుర వధ' చిత్రం. ఆ ఆలోచన కలిగింది బెజవాడలో ఉంటున్న పోతిన శ్రీనివాసరావుకి. 1919నుండే ప్రదర్శన రంగంలో ఉన్న వ్యక్తి ఆయన. ఆంధ్రదేశంలో తొలిసారిగా పర్మనెంట్ థియేటర్ 'మారుతీ సినిమా'ను 1921లో బెజవాడ (నాటి విజయవాడ)లో నిర్మించారాయన. 1921 అక్టోబర్ 23న ఆ థియేటర్‌కు ప్రారంభోత్సవం జరిగింది. కాలనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేసుకున్న ఈ థియేటర్ ఇటీవలే మూతపడింది.)

తెలుగువారే తెలుగు సినిమా తీయాలనే పట్టుదలతో సరస్వతి సినీటోన్ పేరుతో చిత్రనిర్మాణ సంస్థను నెలకొల్పి నిర్మాణానికి ఉపక్రమించారు. తనతోపాటు మరి కొందరిని ఇందులో భాగస్వాములుగా చేర్చారు.

ఈ సినిమా తీయాలనే విషయం మీద తర్జన భర్జనలు జరిగి, చివరికి 'నరకాసుర వధ' గాథను తెరకెక్కిస్తే బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చారంతా. తెలుగులో తొలి 'దీపావళి' చిత్రం ఇదే. అంతే కాదు, శ్రీకృష్ణుడిని తెరమీద తొలిసారిగా చూపించిన సినిమా కూడా ఇదే కావడం విశేషం.

కథ నిర్ణయం జరిగిన తర్వాత ఆర్టిస్టుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఆ రోజులలో నాటక రంగంలో ఒక వెలుగు వెలుగుతున్న వారినీ, ఒక్కక్కరుగా గానీ, ట్రూపుగా కానీ బుక్ చేసుకుని బొంబాయికి, కలకత్తాకి తీసుకువెళ్లి షూటింగ్ చేసేవారు. ఇందులో కాంట్రాక్టర్స్ కీలకపాత్ర వహించేవారు. నిర్మాతకు, కాంట్రాక్టర్‌కు తప్ప, ఆర్టిస్టులకు, నిర్మాతకూ ప్రత్యక్ష సంబంధాలు ఉండేవి కావు. కానీ సరస్వతి సినీటోన్ సంస్థ ఈ పద్ధతిని భిన్నంగా వ్యవహరించి ఆర్టిస్టులను నేరుగా మాట్లాడి బుక్ చేసుకుంది. ఆ నాటి రంగస్థలంపై ప్రసిద్ధి చెందిన పారుపల్లి సూర్యనారాయణని నారదుని పాత్రకు, బొమ్మేటి సూర్యనారాణను నరకాసురుని పాత్రకు, 'ఈలపాట' రఘు రామయ్యని కృష్ణుని పాత్రకు ఎంపిక చేశారు. ఒక్కొక్కరికీ మూడేసి వందల రూపాయలు పారితోషికం. వీరితోపాటు మొత్తం 50మందిని పూణా పట్టణానికి తీసుకువెళ్లారు. వీరందరికీ పట్టణానికి దూరంగా ఉన్న ఒక చిన్న బంగ్లాలో విడిది ఏర్పాటు చేశారు.

మూడు నెలల్లో చిత్ర నిర్మాణం పూర్తయింది. ఈ చిత్రానికి కథ, మాటలు తనే తయారు చేసుకుని దర్శకత్వం వహించారు శ్రీనివాసరావు.

ఈ సినిమా తర్వాత శ్రీకృష్ణుడు పాత్రలకు పెట్టింది పేరుగా రఘురామయ్య ప్రసిద్ధి పొందారు. ప్లేబాక్ పద్ధతి వచ్చిన తర్వాత కూడా తానే పాటలను తనే పాడుకునేవారు రఘు రామయ్య.

## ఆ 'రహస్యం' ఏమిటో!?

తెలుగులో తొలిసారిగా పూర్తి రంగుల చిత్రం (గేవాకలర్ లో) 'లవకుశ' చిత్రాన్ని నిర్మించిన ఎ. శంకర రెడ్డి ఈస్ట్‌మన్ కలర్‌లో తొలి చిత్రాన్ని కూడా నిర్మించాలనే సంకల్పంతో ఆగస్టు 23, 1963న 'రహస్యం' పేరుతో ఒక జానపద చిత్రాన్ని పాటల రికార్డింగ్‌తో ప్రారంభించారు. ఘంటసాల, మాధవపెద్ది సత్యం పాడిన రెండు శ్లోకాలను వాహినీ స్టూడియోలో ఆ రోజు రికార్డ్ చేశారు.

ఈ చిత్రానికి మొదట అనుకున్న హీరో ఎన్.టి.ఆర్. 'లవకుశ' చిత్రంతో తన సంస్థ ప్రతిష్ఠను ఎంతో పెంచిన ఎన్.టి.ఆర్‌తోనే తదుపరి చిత్రాన్ని నిర్మించాలనుకున్నారు. భానుమతి, బి.సరోజాదేవి, ఎస్.వి. రంగారావు, గుమ్మడి, రమణారెడ్డి, సూర్యాకాంతం ఇతర తారాగణం.

ఈ చిత్రానికి మొదట ఎంపిక చేసిన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఎన్.టి.ఆర్ స్థానంలోకి ఎ.ఎన్.ఆర్ వచ్చారు. వేదాంతం రాఘవయ్య దర్శకత్వ బాధ్యతలు స్వీకరించారు. ఇతర తారాగణంలోనూ కొన్ని మార్పులు జరిగాయి. అత్యధిక వ్యయంతో హైదరాబాద్‌లో ఈ చిత్ర నిర్మాణం జరిగింది.